తల్లి లాంటి పార్టీని వీడుతారా!

శంషాబాద్ మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్

- స్వార్థం కోసమే పార్టీ మారుతున్న నేతలు
- సంబండ వర్గాల అభివృద్ధి, సంక్షేమ ప్రధాత కేసీఆర్‌ను మర్చిపోతారా?
- పార్టీ అభివృద్ధికి పాటుపడుతాం, పెద్దసారుకు అండగా ఉంటాం: శంషాబాద్ మాజీ ఎంపీపీ జయమ్మ

శంషాబాద్ రూరల్, జూలై 13: కన్నతల్లి లాంటి పార్టీని విడిచి, అధినేత కేసీఆర్‌నే మోసం చేస్తారా?, అధికార దాహంతో పార్టీలు మారుతున్న నాయకులకు ప్రజలు తగ్గిన బుద్ధి చెబుతారని శంషాబాద్ మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు పలువురు నేతలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. ఉద్యమ పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతో నిబద్ధతతో పోరాడి తెలంగాణ సాధించిన కేసీఆర్‌కు అండగా నిలబడాల్సింది పోయి ఇతర పార్టీల్లో చేరడం సబబు కాదని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, రాష్ట్రాభివృద్ధిని పరుగులు పెట్టించిన బీఆర్ఎస్‌ను వీడటం వారి విజ్ఞతను తెలియజేస్తుందని అన్నారు. సాధించిన రాష్ట్రాన్ని ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణలో పదేండ్ల పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారని వివరించారు. అమలుకు వీలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన పార్టీలో ఎమ్మెల్యే చేరడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇతర పార్టీల్లో చేరే ప్రజాప్రతినిధులు దమ్ముంటే రాజీనామా చేసి వెళ్లాలని సవాల్ విసిరారు. విలువలు లేని విధానాలతో ముందకు సాగితే ప్రజలు గమనిస్తారని, సమయం వచ్చినప్పుడు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉంటారని వారు పేర్కొన్నారు. తమకు రాజకీయంగా జన్మనిచ్చిన బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అండగా ఉంటామని అన్నారు. ఎంపీటీసీగా పోటీ చేయడానికి అవకాశం గులాబీ పార్టీ ఇచ్చిందన్నారు. తనను ఆశీర్వాదించి గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో బీఆర్ఎస్‌కు మంచిరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పదేండ్ల పాటు అధికార పార్టీలో ఉన్న నేతలు, అధికారం కోల్పోగానే పార్టీలు మారుతున్న తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత, పెద్దసారు కేసీఆర్‌కు అండగా ఉంటూ శంషాబాద్ మండలంలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తామని వారు వివరించారు. సంబండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మంచినీటి సరఫరాను పెంచండి

జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, జూలై 13: మంచినీటి సరఫరాను పెంచి ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ఆదేశించారు. శనివారం ఆమె జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌తో కలిసి ఎర్రకుంట వద్ద ఉన్న మంచినీటి రిజర్వయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే ఉన్నాతాధికారులతో చర్చించి కార్పొరేషన్‌కు మరింత నీటి సరఫరాను పెంచాలని సూచించారు. ఇందు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

25 నుంచి వ్యాక్సినేషన్

జూబ్లీహిల్స్, జూలై 13: సీజనల్ వ్యాధులపై పాఠశాల విద్యార్థులకు విస్తృతస్థాయిలో అవగాహన చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈనెల 25 నుంచి మెదడు వాపు వ్యాధి నివారణకు జపనీస్ ఎన్కెఫలైటిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఆగస్టు 15 వరకు స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యునిటీ భవనాల్లో వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు. 9 నెలల నుంచి 15 ఏండ్ల పిల్లలకు వ్యాక్సినేషన్ వేస్తారు.

మహిళ అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 13: ఇంట్లో గొడవపడి గృహిణి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వినాయక్‌నగర్‌లో రాజ్‌కుమార్, మల్లీశ్వరి(35) నివసిస్తున్నారు. ఈనెల 7న ఉదయం మల్లీశ్వరి తన అత్తతో గొడవ జరిగింది. దీంతో మల్లీశ్వరి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో శనివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 94906 17459, 99595 34654లలో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రోడ్డుపై వెలువడిన పొగలు

దుండిగల్, జూలై 13: గాజులరామారం సర్కిల్, సూరారంలోని శివాలయనగర్‌లో శుక్రవారం రాత్రి నుంచి సీసీరోడ్డుపై చిన్నపాటి గుంత ఏర్పడి పొగలు వెలువడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో మరింత బయపెట్టింది. భూగర్భంలో కరెంట్ వైర్ల సమస్యా? లేక వంట గ్యాస్ పైపులైనా? అనే అయోమయంలో స్థానికులు విద్యుత్ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఈ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని కారణాలను గుర్తించారు. ఎర్తింగ్ వైర్ పై రంధ్రం పడడంతో పొగ వచ్చిందన్నారు. ప్రమాదం లేదని చెప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యకు పేదరికం అడ్డు కాకూడదు

అక్షితకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ, జూలై 13: అందరికి విద్య అందాలనే ధ్యేయంతో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తుందని అధ్యక్షుడు వోలం యాదగిరి అన్నారు. ఎస్ఆర్ మాడల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థిని జి.అక్షితకు రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులను గుర్తించి వారి చదువుకు కావాల్సిన సదుపాయాలను కల్పించడంతో పాటు ఆర్థికంగా ఆదుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ దేవిశెట్టి శ్రీధర్, కోశాధికారి బుక్క బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

హిమాయత్‌నగర్, జూలై 13: ఉన్నత లక్ష్యాలు చేరుకునేందుకు విద్యతోనే సాధ్యమని మల్టీజోన్-2 ఐజీపీ వి.సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో వార్షిక ఇన్వెస్టిచర్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు ఎంచుకునే లక్ష్యసాధనలో సంకల్పం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తల్లిదండ్రుల ఆశయాలను సాధించేలా జీవితాలను తీర్చిదిద్దుకోవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు దేశానికి పట్టుగొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండి సమాజాభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్షయ విద్యా వ్యవస్థాపక ధర్మకర్త ఎస్.జనార్దన్, స్కూల్ చైర్మన్ మణికొండ ప్రార్థన, డీన్ రామాంజుల, కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, ప్రిన్సిపాల్స్ ఫమిదా, రేఖారావు, ఫాతిమా ఖాజీమ్ పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

హిమాయత్‌నగర్, జూలై 13: చెన్నారావుపేట మండలంలోని గూడెం, చింతల్ తండాలో అతి కిరాతకంగా ప్రవర్తించిన ప్రేమోన్మాది నాగరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన అమ్మాయిని ప్రేమ పేరుతో మభ్యపెట్టేందుకు ప్రయత్నించాడన్నారు. అమ్మాయి నిరాకరించినందుకు ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, సుగుణలను వేట కొడవలితో నరికి చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆదివాసి గిరిజనులపై వేధింపులు, దాడులు జరగడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం స్పందించి నిందితుడిపై చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

వెంగళరావునగర్, జూలై 13: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో జగదీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024 వస్త్రప్రదర్శన నేటితో ముగియనుంది. ఈ సం దర్భంగా వివిధ స్టాల్స్‌లో ఏర్పాట చేసిన వస్త్రాలు భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా ఉండడంతో మగువలు మరింత ఆసక్తి చూపుతున్నారు. చేనేత కళాకారులను ప్రోత్సహించి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేందుకు ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు జయేశ్ గుప్తా తెలిపారు.

రామరాజ్య ప్రశాసన్ ప్రారంభం

సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారతీయ జాతీయ ముఖ్య ప్రశాసక్ భాస్కర్‌సింగ్

బండ్లగూడ, జూలై 13: రాష్ట్రంలో రెండు రోజులు జరుగనున్న రామరాజ్య ప్రశాసన్ జాతీయ రాజ్యసభ శనివారం నాగారంలో ప్రారంభమైంది. కార్యక్రమం అఖిల భారతీయ ప్రశాసక్ రాచూరి రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖ్‌లకు జాతీయ ముఖ్య ప్రశాసక్ భాస్కర్‌సింగ్ మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల్లో ప్రదేశ్ రాజ్యసభను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సంరక్షన్ వై.శ్రీధర్, అయోధ్య ప్రాంతీయ రవి తివారీ, జాతీయ రాజ్ కోశాధికారి శ్రవణ్‌సింగ్, ఉత్తర ప్రశాసక్ బాగేశ్ శ్రీవాస్టన్, శ్రవణ్ సదర్ మహావీర్, డాంగి వికాస్, కీసరి నర్సింగ్‌రావు, వినోద్ కృష్ణ వీరేందర్, రాష్ట్ర సంరక్షన్ కొమురయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యవర్గం

కేకేబీ సంస్థ రద్దు చేస్తూ కీలక నిర్ణయం

బాలానగర్, జూలై 13 : బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం నియామకమైంది. శనివారం బాలానగర్ శోభనకాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సర్వ సభ్యసమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీర్మాణం చేసినట్లు వారు పేర్కొన్నారు. అధ్యక్షుడుగా అంబటి సునిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా టీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా అలెక్స్, సలహాదారులుగా డి. చంద్రశేఖర్, ఎన్‌వీ రత్నం, విష్ణువర్ధన్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, తోట శివాజీ, బీ శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపాధ్యలుగా డి. ప్రభాకర్, బీవీవీ బాలాజీ, బి. భాస్కర్‌రావు, ఎం శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శులుగా కె. అమరేశ్వర్‌రావు, ఆర్. సూర్యం, ఖాజా, ఎస్‌కే చాంద్ పాషాలతో పాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, ఏడుగురు సభ్యులు ఉన్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యుల పారిశ్రామికాభివృద్ధి కోసం గత ప్రభుత్వాన్ని స్థలం కేటాయించాలని కోరగా..స్థలం కేటాయించిన విషయం సభ్యులందరికీ తెలిసిందే అన్నారు. స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ద్వారా కేకేబీ అనే సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి పాలసీలో సమూల మార్పునకు శ్రీకారం చుట్టి ప్రభుత్వమే అభివృద్ధి చేస్తుందని వెల్లడించారని తెలిపారు.ఈ నేపథ్యంలో కేకేబీ సంస్థ ప్రస్తుతం అవసరం లేనందున రద్దు చేస్తున్నట్లు కమిటీ సభ్యులంతా సమాలోచనలు జరిపి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

చేనేత కళాకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో చేనేత వస్త్ర ప్రదర్శనలో ఉత్పత్తులను తిలకిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హిమాయత్‌నగర్, జూలై 13: రాష్ట్రంలోని చేనేత, హస్త కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తూ వారికి అండగా ఉంటుందని హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం, వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం మంత్రి తుమ్మల సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న అభిరుచులకు, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలు చాలా బాగున్నాయని తెలిపారు. చేనేత వస్త్రాలు ధరించడం వల్ల ఆరోగ్యంతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. చేనేత కార్మికులు తయారు చేసిన విభిన్న రకాల వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కంద గట్లస్వామి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటుక రూప సదాశివం, నేతలు అవ్వారి భాస్కర్, పుట్ట పాండురంగయ్య, గడ్డం జగన్నాథం, ప్రవల్లిక, స్వప్న, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కేంద్రమంత్రికి వినతి

జూబ్లీహిల్స్, జూలై 13: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కేంద్రియ, నవోదయ విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల విషయంలో కేంద్రం శ్రద్ధ చూపాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు కె.నర్సింగ్‌గౌడ్ అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో శ్రీనివాస్‌రెడ్డి, వసంత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్లు పంపిణీ

అల్లాపూర్, జూలై 13: పర్వత్‌నగర్, బోరబండ ప్రాంతాల్లో 120 మంది లెప్రసీ బాధితులకు లెప్రాసొసైటీ సహకారంతో ఎన్‌టీపీసీ వారు, స్లాబ్ (సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్) అధ్యక్షుడు ఎం.రమేశ్ మెడికట్ కిట్లు, టబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఎన్‌టీపీసీ సంస్థ బాధితులకు మెడికల్ కిట్లను పంపిణీ చేయడంపై కృతజ్ఞతలు తెలియజేశారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

శాంతినగర్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

బండ్లగూడ, జూలై 13: అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని డిప్యూటీ మేమర్ రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శాంతినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కోట్లాది నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కరానికి సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీంరెడ్డి, దశరత్, కుమార్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా సీవరేజీ లైన్లు

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో కోటి వ్యయంతో పనులు

పనులను పరిశీలిస్తున్న అధికారులు

తవ్వకాలు చేపడుతున్న సిబ్బంది

జూబ్లీహిల్స్, జూలై 13: పెరుగతున్న జనాభాకు అనుగుణంగా హెచ్ ఎండబ్ల్యూస్ అండ్ ఎస్‌బీ అధికారులు సీవరేజీ లైన్ల విస్తరణ పనులు చేపడుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్-1లోని తెలంగాణ భవన్ వెనుక ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్ట్‌లో భాగంగా రోడ్డు పనులు చేపడుతున్నారు. ఇక్కడ కల్వర్టు నిర్మాణానికి సీవరేజీ లైన్‌ను మళ్లించిన అధికారులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీవరేజీ లైన్ విస్తరణ పనులు చేపడుతున్నారు. సీవరేజీ మెయిన్ లైన్‌ను సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసేందుకు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఇక్కడ 300 ఎంఎం డయా పైప్‌లైన్‌ను 450 ఎంఎం డయాగా విస్తరిస్తున్నారు. ఇటీవల ఇక్కడ రోడ్డు పనులు పూర్తికావడంతో 300 మీటర్ల మేర చేపడతున్న పనులను జలమండలి అధికారులు వేగవంతం చేశారు.

పనులు పరిశీలించిన ఉన్నతాధికారులు..

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో నిర్మిస్తున్న భారీ సీవరేజీ పైప్‌లైన్ పనులను జలమండలి ఉన్నతస్థాయి అధికారుల బృందం గత శుక్రవారం పరిశీలించింది. జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్ విజయ్‌రావు, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్‌తో కలిసి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరో వారంలో పనులు పూర్తి చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాసులు, తట్టిఖాన మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE JUNIOR CIVIL JUDGE R.R DIST
AT : CHEVELLA
O.S NO 46 OF 2023
BETWEEN:
G. Navee Reddy ..Plaintiff
AND
D.Mahesh Kumar ..Defendants
1. D. Mahesh Kumar S/o D. Srinivas Rao Aged about 42 yrs, Occ: Business R/o H.No.6-3-703/1, Street no 12, Himayath Nagar, Hyderabad-500028.
Sir,
Please take notice that Sri G. Naveen Reddy has instituted O.S 46 of 2023 on the file of Honble Junior Civil Judge, Chevella, Ranga Reddy Dist against you Perpetual injunction. You are the sole defendant in this suit. The Honorable Junior Civil Judge in Chevella, R.R Dist, by order dated 26-04-2024 ordered summons to be issued to you through paper publication and posted the matter for hearing on 30-7-2024. In the compliance with the orders of the Honorable court, this notice is being published.
Please make arrangements to be present before the said court on 30-07-2024 at 10:30 Am in O.S 46 of 2023 in the Court of the Honorable Junior Civil Judge, Chevella, Ranga Reddy Dist, either in person or through counsel. Your failure to appear before the Hon'ble Court in the above mentioned may result in the mater being decided Exparty.
"BY THE ORDER OF THE COURT"
P. Roja Reddy, Advocate
Shankarpally. Ph:7207447789

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

యూసుఫ్‌గూడ సర్కిల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూబ్లీహిల్స్, జూలై 13: దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ ఎంటమాలజీ ఏఈ సావిత్రి అన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇండ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఆవరణలో పాత వస్తువుల్లో వర్షపు నీరు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ కవిత, ఉపాధ్యాయులు, ఈఎఫ్ఏలు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

సొంత ప్రయోజనాల కోసమే పార్టీ మార్పు

కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 13: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తన సొంత ప్రయోజనాల కోసమే పార్టీలు మారుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కాటేదాన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ మార్పుపై ఆయన మాట్లాడారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే పార్టీ మారడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే గతంలో అక్రమాలకు పాల్పడి, వాటిని కప్పిపుచ్చుకునేందుకు అధికారంలో ఏ పార్టీ ఉంటే అందులోకి జంప్ అవుతున్నారని విమర్శించారు. ఎప్పుడు పార్టీ మారినా ప్రజా సంక్షేమం కోసమే అంటూ వళ్లించడం ఆయనకు ఆనవాయితీగా మారిందన్నారు. ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తూ గెలిపించిన పార్టీకి ద్రోహం చేయడం సిగ్గుచెటన్నారు. గతంలో టీడీపీ, బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను మోసం చేసినట్లు ప్రస్తుతం కాంగ్రెస్‌లోకి వెళ్లి అదే చేస్తారని ఆరోపించారు. కుటుంబ ఆస్తులు పెంచుకోవడానికే ఆయన కాంగ్రెస్‌లో చేరారన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ అధ్యక్షుడు అడికే జనార్దన్, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, జోగి రవి, తిరుపతిరెడ్డి, శివ, ఎవ్వీ రెడ్డి, శివశంకర్, రామారావు, శంకర్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.